
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం 23 సెప్టెంబరు 2025
5

జాతీయ రహదారుల
భూసేకరణ పూర్తిచేయాలి
- కలెక్టర్లతో సీఎం రేవంత్ వీడియోకాన్ఫరెన్స్ 7
- కేసులున్న భూముల వివరాలను ప్రభుత్వానికి పంపాలని ఆదేశం


మండే ఎండల్లోనూ..
చెరువులను నింపుతా..
- లాభసాటి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి
- గుడిసెలు లేని గ్రామాలే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రఘునాథపాలెం మండలంలో రూ.3కోట్ల పనులకు శంకుస్థాపనలు 6


లచ్చిరాం తండాలో శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైవేల అభివృద్ధికి
తక్షణ చర్యలు అవసరం
- ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయండి
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- రోడ్ల అభివృద్ధితోనే పారిశ్రామిక, పర్యాటకాభివృద్ధి సాధ్యమని వెల్లడి

ఖమ్మం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో జాతీయ, రాష్ట్రీయ రహదారుల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం నుంచి కలెక్టర్లు, నేషనల్ హైవే అధికారులతో సోమవారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించిన క్రమంలో మంత్రి తుమ్మల సీఎంకు జిల్లా రహదారుల సమస్యను లేఖలో తెలిపారు. ఆ లేఖను మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం సోమవారం విడుదల చేసింది. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని, ఖమ్మం నగరానికి రింగ్‌రోడ్డు 7కి.మీ. అనుసంధానం చేయాలని సూచించారు. జగ్గయ్యపేట-కొత్తగూడేనికి నేషనల్ హైవే మంజూరు చేయాలని, రహదారుల నిర్మాణంతో పాటు పారిశ్రామిక, పర్యాటక రంగ అభివృద్ధికి (మిగతా 6వ పేజీలో)

సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ ప్రక్రియ జాప్యం అవుతున్న నేపథ్యంలో జీవో ద్వారా రిజర్వేషన్ల శాతాన్ని పెంచి.. ఎన్నికలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఏ క్షణమైనా స్థానిక ఎన్నికల నగారా మోగే అవకాశం ఉండటంతో ఉమ్మడి జిల్లాలో సందడి మొదలవుతోంది. ఈ క్రమంలోనే రిజర్వేషన్ల ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టగా.. మంగళవారం సాయంత్రంలోపు రిజర్వేషన్లు ఖరారు కాబోతున్నాయి. కులగణన జనాభా లెక్కల ప్రకారంగా బీసీలకు 42శాతం కల్పించనుండగా, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను యథావిధిగా ఉంచుతూ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా జిల్లా పంచాయతీ శాఖ అధికారులు, జిల్లాపరిషత్ అధికారులు ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియపై వడపోత కార్యక్రమం ప్రారంభించారు.



ఇక స్థానిక సందడి!

- కసరత్తు ముమ్మరం చేసిన యంత్రాంగం
- నేడు రిజర్వేషన్లు కొలిక్కి వచ్చే అవకాశం
- త్వరలోనే నోటిఫికేషన్ జారీకి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- ఈ లోపు పనుల పూర్తిపై మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టి
- విస్తృతంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఖమ్మం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మంజిల్లాలో మొత్తం 20జడ్పీటీసీ, 283 ఎంపీటీసీ స్థానాలున్నాయి. మొత్తం 20ఎంపీపీ అధ్యక్ష స్థానాలకు పోటీ జరగనుంది. ఇక 571గ్రామపంచాయతీల్లో 5,214 వార్డులు ఉన్నాయి. ఇందులో 50శాతం మహిళలకు రిజర్వేషన్ల కేటాయించనున్నారు. ఏజెన్సీ ఏరియాలో స్థానిక సంస్థల పదవులు గిరిజనులకు రిజర్వేషన్ అవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 471 పంచాయతీల్లో 4,168 వార్డులున్నాయి. 22 జడ్పీటీసీ, 236 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 22ఎంపీపీ అధ్యక్షులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటికికూడా రిజర్వేషన్ల కసరత్తు జరుగుతోంది. అయితే 2018 స్థానిక సంస్థల చట్టం ప్రకారం గత రిజర్వేషన్లు రెండు పర్యాయాలు ఉండాలి. ప్రస్తుతం ఈ నిబంధనలు సడలిస్తారా లేదా ? మార్పులు చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

రిజర్వేషన్లపై పార్టీల దృష్టి..

అధికారులు రిజర్వేషన్ల ప్రక్రియను అత్యంత గోప్యంగా నిర్వహిస్తుండగా.. రాజకీయపార్టీల దృష్టంతా రిజర్వేషన్ల ప్రక్రియపైనే ఉంది. అధికార, విపక్ష పార్టీల, నేతలు స్థానిక సంస్థలో పోటీచేసేందుకు కేటాయించిన సీట్లతో రాజకీయభవిష్యత్ ముడిపడి ఉంది. దీంతో అన్నిపార్టీలు రిజర్వేషన్లు ఎలాఉండబోతున్నాయన్న దానిపై చర్చలు సాగిస్తున్నాయి. కొందరు మండలాల వారీగా జనాభాలెక్కలు, ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నారు. కులగణన సర్వే ప్రకారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించబోతున్నందున బీసీల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగబోతుంది. ఈ క్రమంలో జనరల్ స్థానాలు తగ్గే అవకాశాలున్నాయి.

అభివృద్ధి పనులపై ఫోకస్

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే విడుదలవుతుందన్న సమాచారంతో జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో మంజూరై ఉన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ప్రధానంగా గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాదులో కార్యక్రమాలను త్వరగా ముగించుకుని సాయంత్రం ముదిగొండ చేరుకుని గ్రామపంచాయతీతో పాటు ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలంలోని తండాలలో రహదారుల పనులకు శంకుస్థాన చేశారు. వీరితో పాటు ఉమ్మడిజిల్లాలో ఎమ్మెల్యేలు కూడా స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. నోటిఫికేషన్ వస్తే పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉండదని, ఈ లోపే అన్ని పనులు పూర్తిచేయించేందుకు కసరత్తు చేస్తున్నారు.


పహారా కాస్తున్న పోలీసులు

పకడ్బందీగా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకోసం జిల్లా యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ ఎన్నికల కోసం సీఈవో దీక్షారైనా, డిప్యూటీ సీఈవో నాగపద్మజతో పాటు ఎంపీడీవోలు, పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల కోసం డీపీవో ఆశాలత, ఎంపీవోలతో ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు.

పరిశీలించిన కలెక్టర్ అనుదీప్

అయితే మండలాల వారీగా గతంలో వినియోగించిన రిజర్వేషన్ల దామాషా, తాజాగా ప్రభుత్వం నుంచి అందిన నిబంధనల ప్రకారం వీటిని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియను మంగళవారం పూర్తి చేసి.. ప్రభుత్వానికి నివేదించనున్నారు. అయితే రిజర్వేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్న జడ్పీ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమ్మా.. భవానీ..

- ఘనంగా దేవీ నవరాత్రులు ప్రారంభం
- దుర్గా దీక్షలు స్వీకరించిన భక్తులు

దేవీనవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండపాల్లో అమ్మవారిని కొలువుదీర్చిన భక్తులు విశేష పూజలు చేశారు. ఈ క్రమంలో తొలి రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమివ్వగా వందలాది మంది భక్తులు భవానీ మాలలు ధరించారు. ఇక ఖమ్మం స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి భక్తుల బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలను జమ్మిబండ వద్ద అత్యంత వైభవంగా నిర్వహించారు. ఖమ్మం ఎన్నెస్పీ రోడ్‌లోని దుర్గామాత ఆలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచి సుమారు 2 వేల మందికిపైగా భవానీ దీక్షలు స్వీకరించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సేవలో నిమగ్నమవనున్న వారు అక్టోబరు 2న దీక్షలు విరమించనున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల మందికి పైగా భవానీ దీక్షలు స్వీకరించినట్లు సమాచారం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురం హవేలి


ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కారుణ్య నియామకాల కోసం
ఖాళీల జాబితా ఇవ్వండి
- ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, ఓఎస్ పోస్టుల జాబితాలను తక్షణమే అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన ఆర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా హాజరైన జిల్లా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒక్కో అధికారి హాస్టళ్ల పనితీరును సందర్శించాలని సూచించామని వాటిని తప్పకుండా తనిఖీలు చేసి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. యూడైస్ పోర్టల్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ప్రకారం విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ లేని పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని, అక్కడ ఆ వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా సంక్షేమ వసతి గృహాల తనిఖీ ప్రతివారం నిర్వహించి, భోజన నాణ్యత వివరాలను తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జిల్లా అధికారులు కారుమంచి శ్రీనివాసరావు, సునీల్‌రెడ్డి, సివిల్‌సప్లై డీఎం శ్రీలత, పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా...

- ఏన్కూరు మండలం జన్నారం రెవెన్యూ పరిధిలో 200 సర్వే నెంబర్‌లో 2వేల ఎకరాలు గుట్టలతో ఉన్న భూమి ఉందని ఈ భూమి గతంలో కాశ్లారి రాంచందర్‌రావు పేరుతో ఉందని సీలింగ్ చట్టం కింద కేటాయించిన ఈ భూమి ఆక్రమణలకు గురవుతోందని ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని ఏన్కూరు మండలానికి చెందిన యండ్రాతి శ్రీనివాసరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- పెనుబల్లి వీఎం బంజరకు చెందిన సోమ్లానాయక్ తండాకు చెందిన ఇస్లావత్ మంగు 48 ఏళ్ల క్రితం గుడిసె వేసుకుని జీవిస్తున్నామని ఇంటిపన్ను, కరెంట్ బిల్లు చెల్లిస్తున్నామని ఆ స్థలానికి హక్కులు కల్పించాలంటూ కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- ఖమ్మం నగరం పాకబండ బజార్‌కు చెందిన ఎం.హరి శ్రావణ్ కుమార్ తనకు రేషన్ షాపులలో ఏదైనా డీలర్‌గా అవకాశం కల్పించి జీవనోపాధి కల్పించాలని కోరాడు.
- కూసుమంచి మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన రత్నకుమారి, పుష్ప, భద్రమ్మ తమకు సర్వే నెంబర్ 1123లో భూపంపిణీ పథకం కింద కేటాయించిన భూమికి ఇతరులు బాటను కబ్జా చేశారని, ఆ బాటను ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంది.
- చింతకాని మండలం లచ్చగూడెం రైతులు తాము పండించిన పెసర పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రతీక్షణం అభివృద్ధి కోసమే
తాపత్రయం
- కేసీఆర్ చేతిలో రాష్ట్రం విధ్వంసమైంది
- గాడిలో పెట్టేందుకు క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నాం
- ముదిగొండ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

6

34 శాతం..
- సింగరేణి కార్మికులకు లాభాల వాటా నిర్ణయం
- సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.95లక్షల బోనస్
- గతేడాదికంటే ఒక్కొక్కరికి రూ.8,289 అదనం
- కాంట్రాక్టు కార్మికులకు పెంచింది రూ.500 మాత్రమే
- మొత్తం రూ.819కోట్లు కేటాయింపు

కొత్తగూడెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు లాభాల వాటా 34శాతం ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాలలో 34శాతం వాటా బోనస్ చెల్లిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నికర లాభాలను ప్రకటిస్తూ లాభాల వాటాను వెల్లడించారు. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.6,394కోట్ల నికర లాభాలు సాధించగా, వాటిల్లో సింగరేణి సంస్థ చేపట్టే కొత్త ప్రాజెక్టుల కోసం రూ. 4,034కోట్లను కేటాయించగా, మిగిలిన రూ.2,360కోట్ల నికర లాభాల్లో రూ.819కోట్లు లాభాల వాటా బోనస్ గా ప్రకటించారు. కాగా సింగరేణి వ్యాప్తంగా సుమారు 41వేల మంది కార్మికులు ఉండగా.. ప్రభుత్వం ప్రకటించిన లాభాల బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,95,610 వరకు లభించనున్నాయి. గతేడాది సగటున ఒక్కో కార్మికుడి రూ.1,87,321 లాభాల బోనస్ చెల్లించగా.. ఈ ఏడాది అదనంగా రూ.8,289 మేర లాభాల బోనస్ లభించనుంది. వారితోపాటు సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మరో 30వేల మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ ప్రకటించారు. అయితే కాంట్రాక్టు కార్మికులకు గతేడాది రూ.5వేలు ప్రకటించగా.. ఈ ఏడాది కేవలం రూ. 500మాత్రమే పెంచారు.



లాభాల వాటా ప్రస్థానం ఇలా..

1999-2000 సంవత్సరంలో తొలిసారిగా సంస్థను కాపాడాలని, ఉద్యోగుల్లో పని సంస్కృతిని మెరుగు పరచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా సింగరేణి యాజమాన్యం లాభాల వాటా బోనస్‌ను ప్రకటించింది. ఆ సంవత్సరంలో రూ.300కోట్లు లాభాలు రాగా.. 10శాతం బోనస్ ప్రకటించింది. అలా ఆనాడు సింగరేణిలో పనిచేస్తున్న 1.07లక్షల మంది కార్మికులకుగాను రూ.30కోట్లు పంచగా ఒక్కొక్కరికి రూ.2,782 బోనస్ లభించింది. 2000-2001లో సగటున ఒక్కో ఉద్యోగికి రూ.805 చొప్పున బోనస్ లభించింది. అప్పట్లో కార్మికుల సగటు జీతం కేవలం రూ.8,500 మాత్రమే ఉండగా.. ప్రస్తుతం సగటున రూ.1.70లక్షలుగా ఉంది. గతేడాది ప్రభుత్వం 33శాతం లాభాల వాటా బోనస్ ప్రకటించింది. మొత్తం రూ.763కోట్లను 33శాతం లాభాల వాటా కింద పంపిణీ చేయగా ఒక్కొక్కరికి సగటున రూ.1.87లక్షలు బోనస్ రాగా.. ఈ ఏడాది నికర లాభాల్లో కేటాయించిన (మిగతా 6వ పేజీలో)

ఒకే అధికారి.. మూడు బాధ్యతలు

- మూడు మండలాల్లో కీలక శాఖలో విధులు
- పంచాయతీల్లో పూర్తిస్థాయి పర్యవేక్షణ అంతంతే
- ప్రజలకు తప్పని ఇబ్బందులు..
- రెగ్యులర్ అధికారులను నియమించాలని వేడుకోలు



ములకలపల్లి మండల పరిషత్ కార్యాలయం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలు పల్లె పాలనకు ప్రజా వేదికలు.. ప్రభుత్వ పథకాల అమలుకు కేంద్రాలు.. అలాంటి పంచాయతీలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఎంతో అవసరం. కానీ అశ్వారావుపేట నియోజకవర్గంలోని రెండు మండలాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. ఒకే అధికారి మూడు మండలాల్లో బాధ్యతలు నిర్వహిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. మూడు మండలాల్లో బాధ్యతలు ఆ అధికారికి కూడా భారంగా ఉన్నా.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏమీ చేయలేని పరిస్థితి. తద్వారా పంచాయతీల్లో పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో.. కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారు. ఫలితంగా వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో సమస్యలు

అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రధాన మండలాలు అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి. ఆయా మండలాలు పూర్తిగా గిరిజన ప్రాంతంలోనే ఉన్నాయి. ఇక్కడ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి తరుణంలో దమ్మపేట మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికి రెండు నెలల క్రితం అశ్వారావుపేట మండల పంచాయతీ అధికారి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. అశ్వారావుపేటలో పనిచేసిన ఎంపీవో ఉద్యోగ విరమణ చేయడంతో.. దమ్మపేట ఎంపీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈరెండు మండలాల్లో దాదాపు 58 గ్రామపంచాయతీలు ఉన్నాయి. రెండు మండలాల్లో ఉన్న ఇన్ని పంచాయతీలను చూడడం అంటే.. సదరు అధికారికి ఒకింత ఇబ్బందే. ఇదే తరుణంలో ములకలపల్లి ఎంపీడీవోకు 'స్థానిక' ఎన్నికల నిమిత్తం జిల్లా కేంద్రంలో బాధ్యతలు అప్పగించారు. దీంతో అశ్వారావుపేట, దమ్మపేట ఎంపీవోగా బాధ్యతలు చూస్తున్న రామారావుకు.. ములకలపల్లి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన నెలరోజులుగా ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అందులోనూ మండలానికి ఎంపీడీవోనే అత్యంత కీలకం. దీన్ని బట్టి చూస్తే సదరు అధికారి చూసే బాధ్యతలు మూడు కూడా అత్యంత ప్రధానమైనవే. మండలాలకు నిత్యం ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు రావడం.. పర్యటనలు చేయడం.. సమీక్షలు.. ఇలా ఎన్నో కార్యక్రమాలు సాధారణంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో మూడు కీలక బాధ్యతలు చూస్తున్న ఎంపీవోకు ఇవన్నీ ఇబ్బందిగానే ఉంటాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పంచాయతీల్లో సదరు అధికారులే కీలకంగా ఉంటారు.

పర్యవేక్షణ ఎలా సాధ్యం ?

ఒక్కో మండలంలో పదుల సంఖ్యలో పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల్లో నిత్యం పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇస్తూ ఉంటేనే పాలన అంతంత మాత్రంగా ఉంటుంది. అలాంటిది రెండు మండలాల్లో పంచాయతీలపై పర్యవేక్షణ, మరో మండలంలో కార్యక్రమాల నిర్వహణ.. ఇలా మొత్తం చూడడం అంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే చెప్పవచ్చు. నిత్యం ప్రజలు కూడా వివిధ రకాల సమస్యలపై పంచాయతీ అధికారులను సంప్రదిస్తుంటారు. ఇలాంటి తరుణంలో రెగ్యులర్ అధికారులు లేకపోతే సమస్యలు ఎలా ఉంటాయే ఇట్టే చెప్పవచ్చు. ఉన్న అధికారే పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయలేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని మండలాల్లో రెగ్యులర్ అధికారులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జీ పంచాయతీ అధికారి రామారావు మాట్లాడుతూ.. మూడు మండలాల్లోనూ పూర్తిస్థాయిలో బాధ్యతలను నిర్వహిస్తున్నానని చెప్పారు. ఎక్కడా.. ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నానని తెలిపారు.

మూడు పోస్టుల్లో ఒకే ఉద్యోగి

- అధ్వానంగా పోస్టాఫీసుల పని తీరు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పలువురు సిబ్బంది
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- దుమ్ముగూడెం ఎస్ఓ పరిధిలో అవకతవకలు



దుమ్ముగూడెం సబ్ పోస్టాఫీసు

దుమ్ముగూడెం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దుమ్ముగూడెం సబ్ పోస్టాఫీసు పరిధిలోని కొన్ని బ్రాంచ్ పోస్టాఫీసుల పనితీరు అధ్వానంగా తయారైందనే ఆరోపణలు వినవస్తున్నాయి. బీఓ (బ్రాంచ్ పోస్ట్ ఆఫీసు) లో పని చేసే సిబ్బందిలో కొందరు ఉద్యోగ నిబంధనలు, సమయపాలన పక్కన బెట్టి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. గతంలో ఓ బీఓ నుంచి డెలివరీ చేయాల్సిన ఉత్తరాలు నడిరోడ్డుపై ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. అయినా సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. తాజాగా ఒక బ్రాంచి పోస్టాఫీసులో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి నిబంధనలకు విరుద్ధంగా ఏకకాలంలో మూడు ఉద్యోగాలు చేస్తూ.. మూడు వేతనాలను పొందడం గమనార్హం. పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంతో కొంత ముడుపులు తీసుకొని ఈ విషయాన్ని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

బీఓ ఉద్యోగి త్రిపాత్రాభినయం

దుమ్ముగూడెం సబ్-పోస్టాఫీసు పరిధిలోని ఒక బ్రాంచి పోస్టాఫీసు ఏబీపీఎం (అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్) గత కొంత కాలంగా తాను చేస్తున్న బీఓలోని రెండు ఉద్యోగాలతోపాటు అక్రమంగా సబ్ పోస్టాఫీసులోనూ మరో ఉద్యోగం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం బ్రాంచి పోస్టు మాస్టరు సెలవు పెడితే.. అసిస్టెంట్ బీపీఎం తన పోస్టుకు సెలవు పెట్టి ఆ పోస్టు బాధ్యతలు చేపట్టాలి. ఏబీపీఎం పోస్టులో మరొకరిని ఏర్పాటు చేయాలి. అప్పుడు బీపీఎం జీతం ఏబీపీఎంకు, ఏబీపీఎం జీతం అతని బదులుగా నియమించిన వ్యక్తికి అందుతుంది. అయితే అక్రమాల ఆరోపణలున్న ఆ బీఓలో రెండు పోస్టులను ఏబీపీఎం నిర్వర్తిస్తుండడం గమనార్హం. ఈ రెండు పోస్టులతో పాటు దుమ్ముగూడెం సబ్-పోస్టాఫీసులో సెలవుపై వెళ్లిన ఒక శాశ్వత ఉద్యోగి పోస్టులోనూ ప్రత్యామ్నాయ విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. దీంతో సదరు బీఓలో కార్యాలయ పనివేళలు అటకెక్కగా.. సమయపాలనకు ముందే మూతపడుతోంది. ఫలితంగా పోస్టల్ ఖాతాదారులకు సక్రమంగా సేవలందడం లేదు.

ఇక్కడ ఇలా.. అక్కడ అలా!

లక్ష్మీనగరం బీఓ ఏబీపీఎం ఎలాంటి అదనపు వేతనం లేకుండా అటు బీపీఎం, ఇటు ఏబీపీఎం బాధ్యతలు చూస్తున్నారు. అక్రమంగా మూడు ఉద్యోగాలు నిర్వహిస్తున్న ఏబీపీఎం పనిచేస్తున్న బీఓలో బీపీఎం సెలవు పెడితే.. అక్కడ రెండు వేతనాలు(బీపీఎం, ఏబీపీఎంలవి) ఎలా మంజూరు చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకే సబ్-పోస్టాఫీసు పరిధిలోని రెండు బ్రాంచి పోస్టాఫీసుల్లో పరస్పర విరుద్ధ నిబంధనలు ఉండడం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

విధులన్నీ ఏక కాలంలోనే..

బ్రాంచి పోస్టాఫీసు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐదు గంటల పాటు నిర్వహించాల్సి ఉంది. సబ్ పోస్టాఫీసు పని వేళలు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాల్సి ఉంది. అయితే మూడు ఉద్యోగాలను ఏకకాలంలో నిర్వహిస్తున్న సదరు ఏబీపీఎం.. అటు బీఓలోనూ, ఇటు ఎస్ఓలోనూ ఒకే సమయంలో మూడు ఉద్యోగాలు ఎలా నిర్వహిస్తారో అధికారులు తేల్చాల్సి ఉంది. బీఓ నిర్వహణకు తాత్కాలికంగా గంట, అరగంట సమయం కేటాయిస్తూ, మిగతా సమయమంతా సబ్ పోస్టాఫీసులో విధులు నిర్వర్తిస్తున్నారు. అక్రమంగా మూడు వేతనాలను ఒకే ఉద్యోగి పొందుతున్న విషయాన్ని ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సదరు ఏబీపీఎం అక్రమంగా.. ఏక కాలంలో మూడు వేతనాలను పొందుతున్న ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండే ఎండల్లోనూ చెరువులను నింపుతా..

- లాభసాటి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయానికి సాగునీటి ఎద్దడిపై మీరు బాధపడాల్సిన అవసరం లేదు. మండె ఎండల్లోనూ సాగునీటి చెరువులను నేను నింపుతా.. మీరు లాభదాయకమైన పంటలను సాగు చేయండి.. రైతులు లక్షాధికారులు కావడమే నా లక్ష్యం'.. అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం లచ్చిరాంతండాలో రూ. 3 కోట్ల విలువైన లచ్చిరాం తండా నుంచి ఈర్లపూడికి బీటీ రహదారి, దొనబండకు వంతెన నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. కాలంతో పాటు వ్యవసాయ రంగంలో అనేక పంటలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తక్కువ శ్రమ, పెట్టుబడి, దీర్ఘకాలిక ప్రయోజనాలతో పాటు కూలీల శ్రమ తక్కువగా ఉండే పంటలను రైతులు సాగులోకి తీసుకు రావాలని కోరారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని చెరువులకు సాగర్ జలాలను అనసంధానించడం జరిగిందన్నారు. వేసవిలోనూ రఘునాథపాలెం మండలంలోని అన్ని చెరువులకు సాగర్ జలాలు అందించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. సాగునీటి సౌకర్యం సంపూర్ణంగా ఉండడంతో రైతులు పామాయిల్ సాగు చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ.50వేల సబ్సిడీ అందుతుందన్నారు. అంతర్గత పంటలను సాగు చేసుకునే అవకాశం ఉందని, ప్రభుత్వం డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. పామాయిల్ సాగు ద్వారా ఒక్కో ఎకరానికి ఏడాదికి రూ.2లక్షల వరకు రైతులు పొందుతున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఇందిరమ్మ రాజ్యం అమలు జరుగుతుందని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను వంద శాతం నిర్మించి ఇస్తామన్నారు. గుడిసెలు, పూరిళ్లు లేని గ్రామాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నివాసాలపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొంది పోడు సాగు చేసుకుంటున్న రైతులను అధికారులు ఇబ్బందులు పెట్టొద్దన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ ఏఎంసీ మానుకొండ రాధాకిషోర్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, విద్యుత్‌శాఖ డీఈ రామారావు, తహసిల్దారు శ్వేత, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ పాల్గొన్నారు.

తుమ్మలకు వినతుల వెల్లువ



దమ్మపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టగా.. రైతులకు అవకాశం మేర లాభదాయకమైన పంటలు పడించాలని, ఉద్యాన సాగు చేయాలని కోరారు. ప్రస్తుతం పామాయిల్, కోకో, అంతరపంటలుగా వక్క, మిరియాలు వంటి పంటలు లాభసాటిగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, మన్నెం అప్పారావు, కాసాని మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైవేల అభివృద్ధికి తక్షణ చర్యలు అవసరం

(5వ పేజీ తరువాయి)

దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో రవాణా సౌకర్యాల మెరుగునకు రహదారులు ఉపయోగపడతాయని, ఖమ్మం- కురవి రోడ్డు నుంచి రింగ్‌రోడ్డుకు రహదారిని అనుసంధానం చేయాలని కోరారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రానికి అన్ని ప్రాంతాల నుంచి భక్తులు వచ్చేలా రహదారులను అభివృద్ధి చేయాలని, సారపాక నుంచి కాళేశ్వరం వరకు, బూర్గంపాడు నుంచి జంగారెడ్డిగూడెం వరకు వయా ములకలపల్లి మీదుగా జాతీయ రహదారులను మంజూరు చేయాలని కోరారు. రహదారుల విస్తరణ, బైపాస్ అనుసంధానం, కొత్త జాతీయ రహదారుల మంజూరుపై దృష్టిసారించాలని ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రానికి పంపాలని సూచించారు. ఈ జాతీయ రహదారులతో పాటు ఇతర రహదారుల మంజూరు తక్షణం అవసరం ఉందని లేఖలో పేర్కొన్నారు.

ఆ లేఖ మేం రాయలేదు!

లచ్చన్న పేరుతో లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

చర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తమ పేరిట విడుదలైన లేఖకు, తమకు ఎలాంటి సంబంధంలేదని.. ఆ లేఖ తాము రాయలేదని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న పేరుతో సోమవారం మరో లేఖ విడుదలైంది. కొద్ది రోజుల క్రితం చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని రాజకీయ నాయకులు, వ్యాపారుల పేర్లతో.. మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ విప్లవ పేరుతో లేఖ విడుదలైన విషయం తెలిసిందే. ఆ లేఖలో రాజకీయ నాయకులు, వ్యాపారులు తమ పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. అయితే ఆ లేఖకు, తమకు ఎలాంటి సంబంధం లేదని డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న పేరుతో సోమవారం మరో లేఖ విడుదలైంది. ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి పని గట్టుకుని కొందరు తమ పార్టీ పేరుతో లేఖ ఇచ్చారన్నారు. దానికి, తమకు ఎలాంటి సంబంధం లేదని లచ్చన్న లేఖలో స్పష్టం చేశారు.

కూర వేయలేదని కార్మికురాలిపై కత్తితో దాడి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నం తింటున్న సమయంలో కూర వేయలేదని ఓ యువకుడు తోటి కార్మికురాలిపై కత్తితో దాడిచేసిన సంఘటన సోమవారం ఖమ్మంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఖానాపురం ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ రెడీమేడ్ కిటికీలు తయారీసంస్థ ఉంది. దానిలో కైకొండాయిగూడెంకు చెందిన బానోత్ రుక్మిణి, రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామానికి చెందిన రవి పనికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం భోజన సమయంలో రవి కూరవేయాలని రుక్మిణిని అడగటంతో ఆమె కూరవేయలేదు. దీంతో రవి కోపంతో సమీపంలోని కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో రుక్మిణి చేతులపై గాయాలుకావటంతో స్థానికులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందజేత

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫోన్లు పోగొట్టుకున్న ఇద్దరు వ్యక్తులకు ఖానాపురంహవేలి సీఐ భానుప్రకాష్ సోమవారం తిరిగి అందజేశారు. ఖమ్మంకు చెందిన అరవపల్లి సాయికుమార్, ఏరుకుల శ్రీను అను వ్యక్తులు ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల రెండు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఐఎంఈఐ నెంబర్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను సీఐ భానుప్రకాష్ బాధితులకు అందజేశారు.

సరదాగా పిలిస్తే.. కిడ్నాప్ అనుకున్న బాలురు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలురుని ఆదివారం కిడ్నాప్‌కు యత్నించారన్న సంఘటన కలకలం రేపింది. దీనిపై టూటౌన్ పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా విచారణచేసి సదరు కారును గుర్తించారు. రఘునాథపాలెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు అయిన వాసు ఖమ్మం ఉపేంద్రయ్యనగర్‌లో నివాసముంటున్నాడు. తన స్నేహితులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లేందుకు ఆదివారం మధ్యాహ్నం సమయంలో గట్టయ్య సెంటర్‌కు వచ్చాడు. దీంతో కారులో ఉన్న అతని స్నేహితులు సైకిల్‌పై వెళ్తున్న బాలురుని దగ్గరకు రావాలని పిలవడంతో కిడ్నాప్‌కి యత్నింస్తున్నారని అనుకుని పారిపోయారని పోలీసులు తెలిపారు. కారులో ఉన్న యువకుడు సరదాగా పిల్లల్ని పిలవడంతోనే ఇలా జరిగినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

34శాతం..

(5వ పేజీ తరువాయి)

రూ.2,360 కోట్లలో 34శాతం లాభాల వాటా బోనస్ ప్రకటించగా ఒక్కొక్కరికి సగటున రూ.1,95,610 రానున్నాయి.

పక్కన పెట్టిన నగదు దేనికోసం

- వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్

గతేడాది సంస్థ అభివృద్ధికోసం పక్కకు పెట్టిన రూ. 2,289 కోట్లను దేని కోసం ఖర్చు చేశారని, ప్రస్తుతం 34 శాతం లాభాల్లో వాటా ప్రకటనకు ముందు పక్కకు పెట్టిన రూ. 4,034 కోట్లను దేని కోసం ఖర్చు పెడతారనే వివరాలు తెలుపకుండా యాజమాన్యం గుర్తింపు సంఘంతో చర్చించకుండా లాభాల్లో వాటా ప్రకటన చేయించడం సరైన విధానం కాదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యం వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తోందన్నారు. వాటా ప్రకటన అనంతరం సింగరేణి భవన్ లో యాజమాన్యంతో గుర్తింపు సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై మాట్లాడటానికి ప్రయత్నం చేసిన యూనియన్ నాయకులను తప్పుదోవ పట్టించి చర్చలు జరపకుండా ఏకపక్షంగా కంపెనీకి వచ్చిన లాభాల్లో నుంచి రూ.4,034 కోట్లను ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం కేటాయిస్తున్నామని, కేవలం రూ.2360 కోట్లను మాత్రమే గత ఆర్థిక సంవత్సరానికి లాభాలు వచ్చిందని ప్రకటించడం, అందులో 34 శాతం వాటాను ప్రకటించారన్నారు. 2023-24లో సంస్థకు వచ్చిన లాభాల్లో రూ.2,289 కోట్లను ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం తీసిన యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 4,034 కోట్లను తీయడం విడ్డూరంగా ఉందన్నారు.

కార్మికుల మనోభావాలను దెబ్బతీసిన సింగరేణి యాజమాన్యం

- పి.సతీష్, టీయూసీఐ కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేసిందని టీయూసీఐ కొత్తగూడెం రీజీయన్ కార్యదర్శి పి.సతీష్ అన్నారు. కొత్తగూడెంలో సోమవారం జరిగిన రీజియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో సుమారు దశాబ్ద కాలానికి పైగా పలు విభాగాల్లో సుమారు 30 వేల మంది కాంటాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సంస్థ లాభాలు రావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వీరి శ్రమ ఉందన్నారు. కార్మికులను చులకనగా చూస్తూ రూ. 500 పెంచడంకంటే దౌర్భాగ్యమైన పరిస్థితి మరొకటి లేదన్నారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కూడా నోరు మెదపకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే పునరాలోచన చేసి తక్షణమే రూ. 10వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ద్వంద్వ వైఖరి అవలంబించిన సింగరేణి యాజమాన్యం

- ఎస్.సంజీవ్, సింగరేణీ కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ)

రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సంయుక్తంగా ప్రకటించిన వార్షిక లాభాల వాటాలో కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని సింగరేణీ కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎస్.సంజీవ్ అన్నారు. కంపెనీ సాధించిన లాభాల్లో సింగరేణిలో పనిచేస్తున్న 32వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దాగి ఉందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ లేకుండా సింగరేణి సంస్థ అన్ని వందల కోట్ల రూపాయల లాభాలను అర్జించలేదన్నారు. గతేడాది ప్రకటించినట్టుగానే ప్రస్తుతం కూడా కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.5,500 ప్రకటించి మొండిచేయి చూపించిందన్నారు. కాంటాక్ట్ కార్మికులకు లాభాల వాటాలో అన్యాయం జరిగినదానికి నిరసనగా మంగళవారం సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

కార్మికుల లాభాల్లో 50శాతం కోత

- కాపు కృష్ణ, రాష్ట్ర ముఖ్యప్రధాన కార్యదర్శి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం

కార్మికులకు ఇచ్చే లాభాల్లో 50శాతం పైగా కోత విధించారని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ అన్నారు. మొత్తం రూ.6,394 కోట్ల లాభాలు వస్తే, కేవలం రూ.2,360కోట్లను ఇవ్వడమేంటని ప్రశ్నించారు. దసరా పండుగ పూట సీఎం కార్మికులకు చేదుకబురు చెప్పారన్నారు. సమైక్య రాష్ట్రంలో, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సింగరేణి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. నమ్మి ఓటేసినందుకు సింగరేణి కార్మికులను వంచన చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికుల సంక్షేమంగా ఉన్నారనీ, కాంగ్రెస్ పాలనలో ఘోరమైన సంక్షోభంగా మారిందన్నారు. నికర లాభాల్లో కోట్లలో 34 శాతాన్ని బోనస్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ సర్కార్ నికర లాభంలో కార్మికులకు వాటా ఇచ్చారన్నారు. దీనిపై నిరసనగా మంగళవారం అన్నీ మైన్స్‌ల మీద, డిపార్ట్‌మెంట్లలో, కార్యాలయాల్లో నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

ప్రతీక్షణం అభివృద్ధి కోసమే తాపత్రయం


ముదిగొండ సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

ముదిగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీక్షణం తమ ప్రజా ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసమే తాపత్రయ పడుతోందని, పదేళ్ల పాలనలో రాష్ట్రం కేసీఆర్ చేతిలో పడి విధ్వంసమైందని డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన ముదిగొండ మండలం మాధాపురం, ఎడవల్లి, ఎడవల్లి లక్ష్మీపురం, ముదిగొండ, వెంకటాపురం గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం వెంకటాపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మాట్లాడారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి రాష్ట్రవ్యాప్తంగా పలు పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి అప్పులు చేస్తే ఇప్పుడు వడ్డీలు కట్టడానికే సరిపోతుందని, అప్పుల నుంచి బయటపడేయటానికి తమ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీనేనని తెలిపారు. రూ.ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, పేదవాడి కళ్లలో ఆనందం చూసి ఇందిరమ్మ ప్రభుత్వం తన్మయం చెందుతోందన్నారు. అనంతరం మండలంలోని గోకినపల్లికి చెందిన బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మీగడ శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు ఎడవల్లి, చిరుమర్రి, ఎడవల్లి లక్ష్మీపురం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి భట్టి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, కొమ్మినేని రమేష్‌బాబు, మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, తుపాకుల యలగొండస్వామి, కందిమళ్ల వీరబాబు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

స్వామివారిని దర్శించుకున్న సినీ సంగీత దర్శకులు బోలే షావలి


రామాలయంలో సంగీత దర్శకులు బోలే షావలి, కాంగ్రెస్ నాయకులు

భద్రాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే స్వామి వారిని సినీ సంగీత దర్శకులు, బిగ్‌బాస్ ఫేమ్ బోలే షావలి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ నాయకులు సరెళ్ల నరేష్, దొడ్డిపట్ల కోటేష్, సత్యలింగం, సరెళ్ల వెంకటేష్‌లు ఉన్నారు.

జాతి మేకల పెంపుదలకు కొత్త ప్రణాళికలు


కలెక్టర్‌కు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక అభివృద్ధికి మేకల షెడ్ల నిర్మాణం, స్థానిక జాతి మేకల పెంపుదలకు కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఇటీవల తమిళనాడులోని పాండిచ్చేరి వెళ్లి శిక్షణ పొందిన అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా జిల్లాలో లభించే మట్టిని వినియోగించి, పర్యావరణానికి అనుకూలంగా, ఉపాధి సృష్టించే విధంగా గ్రామపంచాయతీల్లో అంగనవాడీ భవనాలు, కమ్యూనిటీ, శానిటరీ కాంప్లెక్స్‌లు, ఎస్ఎస్‌జీ వర్క్‌షెడ్లు, కాంపౌండ్ వాల్స్ పశువుల పాకలు, మేకల/గొర్రెల పాకలు, పౌల్ట్రీ షెడ్లు వంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. మేకల షెడ్డు నిర్మాణానికి సంబంధించిన నమూనాను పరిశీలించి వీలైనంత తక్కువ ఖర్చుతో మెరుగైన, నాణ్యమైన మేకల షెడ్లను నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక జాతి మేకల అభివృద్ధి కోసం మంచి జాతి మేకల పోతులను ఎంపిక చేసి, ఏదైనా ఒక గ్రామంలో ఐదు పోతులను పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. శిక్షణ పొందినవారిలో తిరుపతయ్య, కార్తీక్, హేమంత్ కుమార్‌లు ఉండగా.. పర్యావరణానికి హాని కలగకుండా, స్థానికంగా లభించే మట్టిని వినియోగించి గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలు చేయడం, ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించడం వంటి అంశాలను అభ్యసించారు. ఈ సమావేశంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, పశువైద్యులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ సంతోష్, డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో శరన్నవరాత్రి ప్రయుక్త విజయదశమి

నేటి నుంచి 2వ తేదీ వరకు నిర్వహణ
శ్రీరామాయణ మహాపారాయణ మహోత్సవాలు
నేడు ఆదిలక్ష్మీ అలంకారం

భద్రాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవ ప్రయుక్త విజయదశమి వేడుకలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. అలాగే చిత్రకూట మండపం వేదికగా శ్రీరామాయణ మహాపారాయణ మహోత్సవాలు ఇదే సమయంలో నిర్వహించనున్నారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రి దేవస్థానంలో నిర్వహిస్తున్న మాదిరిగానే భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏటా శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భద్రాద్రిలో నిర్వహించే ఈ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎంతో ప్రత్యేక ఉంది. ఇక్కడ పంచరాత్రాగమన శాస్త్రంకు అనుగుణంగా వీరలక్ష్మి ఉత్సవాలుగా భక్తరామ దాసు కాలంనాటి నుంచి కొనసాగుతున్నాయి. అయితే కాలక్రమేణా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఈఉత్సవాల సమయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం గత 52 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. అక్టోబరు 2న శ్రీరామాయణ పారాయణం సమాప్తి సందర్భం గా శ్రీరామ మహాపట్టాభిషేకం, శమీపూజ, శ్రీరామలీలా మహోత్సవాలు నిర్వహించను న్నారు.


విద్యుత్ లైటింగ్‌తో ముస్తాబైన శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం

సకలాభీష్టాలను ప్రసాదించే కల్పవృక్షం

శ్రీరామాయణ మహాపారాయణం సకలారిష్టాలను తొలగించే కల్పవృక్షం. ఈ పారాయణంను భద్రాచల క్షేత్రంలో చైత్రశుద్ధ పాడ్యమి నుంచి శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రి ప్రయుక్తంగా నిర్వహిస్తారు. అలాగే ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు శరన్నవరాత్రి ప్రయుక్తంగా ఏడాదికి రెండుసార్లు నవాహ్నికంగా నిర్వహించడం ఆచారం. ఈ క్రమంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శ్రీరామాయణ పారాయణ మహోత్సవాల సందర్భంగా 108 మందితో సామూహిక పారాయణంను పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనే వారికి పది రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు స్వామి వారి దర్శనం, అనుగ్రహ పత్రాలను దేవస్థానం అధికారులు అందజేస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా.

- ఉదయం 8.30 నుంచి 9.30 వరకు శ్రీ లక్ష్మీ అమ్మవారి సన్నిధిలో అభిషేకం
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చిత్రకూట మండపంలో సామూహిక శ్రీరామాయణపారాయణం
- 3.30 నుంచి 5గంటల వరకు శ్రీ లక్ష్మీతాయారు సన్నిధిలో సామూహిక కుంకుమార్చన
- 5.30 నుంచి రాత్రి ఏడు గంటల వరకు విశేష దర్బారుసేవ, నివేదన మహామంత్ర పుష్పం ప్రసాదగోష్ఠి
- సాయంత్రం 7నుంచి 8.30 వరకు చిత్రకూట మండపంలో శ్రీరామాయణ ప్రవచనం
- 7.30 నుంచి 8.30 వరకు స్వామివారి తిరువీధి సేవ
- ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి చిత్రకూట మండపంలో సంక్షేప రామాయణహోమం

విజయలక్ష్మి అలంకారంలో అమ్మవారు


నేడు ఆదిలక్ష్మీ అలంకారం

లక్ష్మ అంటే గుర్తు అని అర్థం. భగవంతున్ని గుర్తించడానికి ప్రధాన(కారణ) లక్షణమైన అమ్మకు లక్ష్మి అని పేరు. భగవంతున్ని గుర్తించడానికి ఆలంబనమైన లక్ష్మీ తత్వాన్నే ఆదిలక్ష్మి అంటారు. ఆదిలక్ష్మి పురుషాకారంతో జీవులు తరిస్తారు. ఈమె చతుర్భుజాలతో పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద అభయ హస్తాలతో విరాజిల్లుతుంది.

కైంకర్య వివరాలు

శ్రీ లక్ష్మీ అమ్మవారికి అభిషేకం రూ.100
సామూహిక కుంకుమార్చన రూ.500
శ్రీరామాయణపారాయణం రూ.1000
సంక్షేప రామాయణ హవనం రూ.1500
అమ్మవారికి విశేష అలంకారం రూ.1000
శాశ్వత ఉభయం రూ.10,000

అర్హులైన ప్రతీ గిరిజనుడికి
సంక్షేమ పథకాలు అందాలి

ఆది కర్మయోగి అభియాన్ అమలుపై కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ జోనల్ మేనేజర్ ప్రదీప్ కుమార్‌సింగ్ సమీక్ష

భద్రాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి అందేలా ప్రవేశపెట్టిన ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ జోనల్ మేనేజరు ప్రదీప్‌కుమార్‌సింగ్ సోమవారం ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదలకు అందించేందుకు డీఎంటీలకు ప్రత్యేక శిక్షణఇచ్చి గ్రామాల్లో చేపట్టవలసిన కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గ్రామాల్లో సాథీ సహాయోగులను, ఎన్జీవోస్‌ను ఏర్పాటు చేసుకునే విధంగా సూచించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంకు నోడల్‌అధికారిని నియమించి పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామస్తులకు తెలిసేలా ప్రచారం చేయించామని వివరించారు.


ఐటీడీఏ పీవో రాహుల్‌తో సమీక్షిస్తున్న ప్రదీప్ కుమార్ సింగ్

గ్రామాల వారీగా జరిపే కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించడం జరిగిందని అలాగే గ్రామాల్లో రచ్చబండ, గ్రామసభలకు సంబంధించిన వివరాలు పొందుపరిచి గ్రామస్తులందరూ ఒక దగ్గర చేరి చర్చించి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డులు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్షపడేలా కృషి చేయడం అభినందనీయం

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హత్య కేసుల్లోని నేరస్థులకు శిక్షపడే విధంగా కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, కోర్టు డ్యూటీ అధికారులను భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట, మణుగూరు, కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లలో నమోదైన మర్డర్ కేసుల్లోని నేరస్థులకు శిక్షలు పడే విధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, కోర్టు డ్యూటీ అధికారులను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా లోక్ అదాలత్ ద్వారా అత్యధికంగా కేసుల పరిష్కారంలో ప్రతిభ కనబరిచిన చుంచుపల్లి, సుజాతనగర్ కోర్టు డ్యూటీ అధికారులను ఈ సందర్భంగా అభినందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ.లక్ష్మీ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ లావణ్య, విశ్వశాంతి, రాజారావు, మణుగూరు కోర్టు డ్యూటీ అధికారి అశోక్, కొత్తగూడెం త్రీటౌన్ కోర్టు డ్యూటీ అధికారి హేమీలాల్, అశ్వారావుపేట కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగేశ్వరరావు, సుజాతనగర్ కోర్టు డ్యూటీ అధికారి మోహన్, కొత్తగూడెం 3 టౌన్ పీఎస్ జెఎఫ్‌సీఎం కోర్టు డ్యూటీ అధికారి శోభన్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్‌ఐ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.


పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

జాతీయ రహదారుల భూసేకరణ పూర్తిచేయాలి

కలెక్టర్లతో సీఎం రేవంత్ వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్ /కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాధాన్యత క్రమంలో జాతీయ రహదారుల భూసేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర సీఎస్ కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి జాతీయ రహదారుల అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూ డెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ విజయవాడ ఎన్.హెచ్ 65 ఆరు లైన్ల రోడ్డు పనులు, హైదరాబాద్ నుంచి అమరావతి, మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్, హైదరాబాద్ - డీండీ ఎన్‌హెచ్ 765నాలుగు లైన్ల రోడ్డు, ఎన్‌హెచ్ 163 మన్నెగూడ సెక్షన్ నాలుగు లైన్ల రోడ్డు, హైదరాబాద్ - మంచిర్యాల కారిడార్ 4 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే కారిడ ర్ పనులపై సీఎం సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతీ కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్. అధికారులు, రాష్ట్ర అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ రహదారులకు మొదటి ప్రాధాన్యతగా భూ సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్, జిల్లా అధికారులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 163జీ లో భాగంగా ఖమ్మం జిల్లాలో 12 కిలో మీటర్ల మేర రోడ్డు వేసేందుకు 42 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. కొదుమూరు గ్రామంలో రైతులతో చర్చలు జరుపుతున్నామని, వారిని ఒప్పించి పెండింగ్‌లో ఉన్న 2.6 కిలో మీటర్ల భూ సేకరణ సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. 42 హెక్టార్లు 5 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్నాయని, వీటిలో 3 రెవెన్యూ గ్రామాల రైతులకు పరిహారం వచ్చిందని, ఈ భూములను సెప్టెంబర్ చివరి నాటికి బదలాయింపు చేస్తామన్నారు. మల్లెమడుగు, రేగులచలక రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ఎన్‌హెచ్ నుంచి పరిహార చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి బ్యాంకు వివరాలు తీసుకుని అక్టోబర్ 15నాటికి ఈ గ్రామాలో భూ బదలాయింపు పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో సమావేశంలో డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, నేషనల్ హైవే ఈఈ యుగేందర్, కలెక్టరేట్ భూసేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, నేషనల్ హైవేస్ డీఈ శైలజ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

చండ్రుగొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చండ్రుగొండ మండలం అన్నారం తండా వద్ద సోమవారం సాయంత్రం ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం గానుగపాడుకు చెందిన మొగులిపువ్వ నాగరాజు, తాటికూరు ఎల్లయ్య ద్విచక్ర వాహనపై కొత్తగూడెం నుంచి స్వగ్రామం గానుగపాడు వస్తున్నారు. మార్గమధ్యలో అన్నారంతండా వద్ద మూలమలుపులో ఎదుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనపై ఉన్న ఇరువురు యువకులు కిందపడడంతో తీవ్ర గ్రాయాలపాలైయ్యారు. క్షతగాత్రులను స్థానికులు 108లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో నాగరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎస్‌జీఎఫ్ అండర్- 17, 19 ఉషూ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 25 నుంచి 27 వరకు మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురులో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడిజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17, 19 బాల, బాలికల ఉషూ జట్లను సోమవారం ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 45 మంది క్రీడాకారులు హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఏజీఎఫ్ జిల్లా సెక్రెటరీ పూనాటి వెంకటేశ్వర్లు ప్రకటించారు. బాలుర జట్టులో సాయిమహర్షి, హర్షణ్, చక్రధర్ ఆర్యన్, అభిషేక్‌గౌడ్, యజ్ఞసేన్, ఉమర్‌పరూఖ్, బాలికల జట్టులో చైత్రవర్షిణి, సంజన, భావన, జాస్మిన్, ఫిర్దోస్, ఫరూక్‌బేగ్‌లు ఎంపికైనారని తెలిపారు. ఎంపికలను పీడీలు బీమరాజ్, సైదేశ్వరరావు, ముజాహిద్, చంద్రశేఖర్, సత్యనారాయణ తదితరులు సమీక్షించారు.

శాస్త్రీయ భావాల వైపు ప్రజలను మరల్చాలి

జేవీవీ కృషి అభినందనీయం : ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రావు

ఖమ్మంలీగల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ భావాల వైపు ప్రజలను మరల్చాల్సిన అవసరం ఎంతగానో ఉందని, అందుకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక 5వ జిల్లా వార్షిక సమావేశం జిల్లా అధ్యక్షుడు వి.మోహన్ అధ్యక్షతన ఖమ్మంలోని మంచికంటి మీటింగ్‌హాల్లో సోమవారం జరిగింది. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రావు ప్రారంభోపన్యాసం చేశారు. మూఢ నమ్మకాల వంటి దురాచారాల పట్ల ప్రజల్ని చైతన్య పరచాలన్నారు. ప్రతి విషయానికి గొడవలుపడి కేసుల దాకా వెళ్తున్నారని, వారికి చైతన్య న్యాయంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ క్రైమ్ ఏసీపీ సీహెచ్.ఆర్వీ ఫణీందర్ మాట్లాడుతూ మనిషి ఆశ, భయం అనే శక్తులు ఎప్పుడూ పీడిస్తుంటాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్ వాడేటప్పుడు వ్యక్తిగత వివరాలను ఎవరికి పడితే వారికి ఇవ్వవద్దని సూచించారు. అనంతరం కె.రాములమ్మ, వి.సునంద, వి.మోహన్ అధ్యక్షవర్గంగా జరిగిన 5వ జిల్లా వార్షిక సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెలిమల రాజేశ్వర్, రాజా దిశానిర్దేశం చేశారు. కార్యదర్శి కె.రామారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం 7సబ్ కమిటీల కన్వీనర్లు నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లెంపాటి వీరభద్రరావు, మచ్చా సూర్యనారాయణ, వంజాకు లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎల్.వీ.రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎన్.శ్రీనివాస్, ఆర్.వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రావు

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతకాని, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం గంధసిరి రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లును జగన్నాథపురం సమీపంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరేందర్ తెలిపారు.

చుంచుపల్లిలో వ్యక్తి మృతి

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చుంచుపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చుంచుపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. నల్గొండ జిల్లాకు చెందిన సుభాష్ (42) కొత్తగూడెం - ఖమ్మం ప్రధాన రహదారిపై మృతి చెంది ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి మార్చురీకి భద్రపరిచేందుకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు లారీ క్లీనర్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. ఈ మృతిపై చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ ఉద్యమాలు చేస్తాం..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు సాధించేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. కొత్తగూడెం పట్టణ సమీపంలోని కొమరంభీమ్ కాలనీ వాసులకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు ఏళ్ల క్రితం కొమరం భీమ్ కాలనీలో ఇళ్ల స్థలాల సాధన కోసం పేదలు గుడిసెలు వేసుకున్నారని, వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలు గూడు కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వం ఇల్లు ఇస్తామని మోసం చేసిందని, ప్రజాప్రభుత్వం సైతం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం జరగడం లేదని ఆరోపించారు. కొమరంభీమ్, వెంకటేశ్వర కాలనీలో గుడిసెలు వేసుకున్న ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే సైతం పేదల సమస్యల పట్ల స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ వాసులు, సీపీఎం నాయకులు బతుకమ్మలతో నిరసన తెలుపుతూ కలెక్టరేట్ వరకు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, వెంకటేశ్వర్లు, పద్మ, తులసీరామ్, నరసింహారావు, రమేష్, ప్రసాద్, శ్రీరాములు, నిరంజన్, జలాల్, ప్రశాంత్ , బాలకృష్ణ, సంధ్య, జ్యోతి, అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

లక్ష్మీదేవిపల్లిలో పోలీసుల కార్డన్ సెర్చ్

- 100 ద్విచక్రవాహనాలు, రూ. 20వేల మద్యం బాటిళ్లు స్వాధీనం


లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రికొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఎదురుగడ్డ గ్రామపంచాయతీలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేసి సరైన పత్రాలు లేని 100 ద్విచక్రవాహనాలు, 8 ఆటోలను స్వాధీనపర్చుకున్నారు. అక్రమంగా నిల్వచేసిన 128 గ్యాస్ సిలిండర్లు, రూ. 20వేల విలువైన లిక్కర్ బాటిళ్లు, రూ.15వేల విలువైన గుట్కాప్యాకెట్లను స్వాధీన పర్చుకున్నారు. అక్రమంగా కొందరు బెల్టుషాపులను నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారి వద్దనుంచి లిక్కరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రహెమాన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. అదే విధంగా నిషేధిత గంజాయి, గుడుంబా, గుట్కా వంటి వాటిని అమ్మినా, సేవించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి బాణ సంచాలు అనుమతి లేకుండా విక్రయించవద్దని సూచించారు. సైబర్‌నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో కొత్తగూడెం డివిజన్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహెమాన్


పోలీసులు సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

విద్యుదాఘాతంతో సీపీఐ నాయకుడి మృతి

జూలూరుపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకు డు సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వల్లపిన్ని సత్యనారాయ ణ (65) తన ఇంటి ఆవరణలో విద్యుత్ సర్వీసింగ్ మోటార్‌తో ట్రాక్టర్‌ను కడుగుతున్నాడు. ఈ క్రమంలో మోటార్‌కు విద్యుత్ సప్లై కావటంతో కింద పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అతని భార్య అరుణమ్మ బయటికి వచ్చి చూడగా భర్త కిందపడి అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఒక్కసారిగా ఆమె ఆందోళన చెంది చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య అరుణమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతదేహాన్ని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్ సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లంకి మధు, గార్లపాటి వీరభద్రం, యాసా రోశయ్య, టీడీపీ నాయకుడు యల్లంకి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణ(ఫైల్)

దుకాణాల్లో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు

మాచినేనిపేట తండాలో సారా స్వాధీనం
ఓ మహిళపై కేసు నమోదు

జూలూరుపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులోని పలు దుకాణాల్లో కొత్తగూడెం ఎక్సైజ్ ఎస్సై బాషా ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు దుకాణాలలో బెల్లం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. మాచినేనిపేట తండాలో ఓ మహిళ ఇంట్లో సోదాలు నిర్వహించి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ ఎస్సై మాట్లాడుతూ వ్యాపారులు ప్రజలకు అర కేజీకి మించి బెల్లాన్ని విక్రయించవద్దని సూచించారు. అధిక మొత్తంలో బెల్లాన్ని విక్రయించినట్లయితే కొంతమంది ఆ బెల్లంతో గుడుంబా తయారు చేసే అవకాశం ఉందని తెలిపారు. వ్యాపారులు తప్పనిసరిగా బెల్లం విక్రయాల్లో నిబంధనలు పాటించాలని కోరారు. వ్యాపారులు ఎక్కువ మొత్తంలో బెల్లం అమ్మకూడదని పోలీసులు హెచ్చరించారు. మాచినేనిపేట తండాలో నాటుసారాను విక్రయించేందుకు ఇంట్లో సిద్ధంగా ఉంచగా దాన్ని స్వాధీనం చేసుకుని, ఆ మహిళపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాండ్ మేళంతో ట్రాఫిక్‌కు అంతరాయం

ఆరుగురిపై కేసు నమోదు

చింతకాని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం జగన్నాథపురం రైతు వేదిక సమీపంలో బ్యాండు మేళం వాయిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన సంఘటనకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరేందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొప్పారం గ్రామానికి చెందిన బ్యాండు మేళం బృందం పందిళ్లపల్లి దుర్గామాత విగ్రహం వద్ద వేడుకల కోసం సోమవారం ఉదయం వచ్చారు. ఆ సమయంలో రైతులు యూరియా కోసం జగన్నాథపురం రైతు వేదిక వద్ద ఆందోళన చేపడుతున్నారు. ఓ వ్యక్తి బ్యాండు మేళం బృందాన్ని అక్కడకు రప్పించి ఖమ్మం- బోనకల్లు రహదారిపై మేళం వాయిస్తూ ఆ మార్గంలో రవాణాను అడ్డుకున్నారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పోలీసులు వారించినా వినకుండా వారు పెద్ద శబ్దంతో బ్యాండు మేళం వాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరేందర్ తెలిపారు.

ఏడీసీపీ అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన రామానుజం



ఖమ్మంక్రైం,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మంఅడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా బి.రామానుజం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా హైదరాబాదు వెయిటింగ్‌లో ఉన్న ఆయన ఖమ్మం ఏడీసీపీ అడ్మిన్‌గా నియమించారు. సోమవారం ఖమ్మం కమిషనరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీకార్యాలయంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

దేవీ నవరాత్రులు ప్రారంభం

- తొలిరోజు బాలత్రిపురసుందరిగా అమ్మవారి దర్శనం
- జిల్లాలో 10వేలకు పైగా భవానీ దీక్షలు తీసుకున్న భక్తులు



ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవినవరాత్రుల వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని పలు ఆలయాలు, మండపాల వద్ద అమ్మవారి నవరాత్రుల మొదటి రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలో స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలు జమ్మిబండ వద్ద వైభవంగా నిర్వహించారు. అమ్మవారు శ్రీబాలత్రిపు సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక కలశ, గణపతి పూజ, కుంకుమార్చనతో అమ్మవారి పూజలు ప్రాంభించారు. ఆలయ ఈవో కొత్తూరు జగన్ మోహన్‌రావు,భక్తబృందంఅధ్యక్షుడు తూములూరి లక్ష్మీ నరసింహారివు, స్థానిక కార్పోరేటర్ కర్నాటి కృష్ణ, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు. స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ధనలక్ష్మీ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, ఎన్ఎస్‌పి రోడ్ దుర్గామాత ఆలయంలో, మామిళ్లగుడెం, గాంధీ చౌక్, ప్రశాంతినగర్, ఖైకొండాయిగుడెం, జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, తదితర ప్రాంతాలలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.సాయంత్రం అమ్మవారి మండపాల వద్ద మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

నేలకొండపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం దేవీ శరన్నవ రాత్రులు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రామ మందిరంలో దేవీ నవరాత్రులను అంగరంగ వైభవంగా మొదలుపెట్టారు. అర్చకుడు పతంగి పవన్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు చేసారు. అమ్మవారు గౌరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



పర్ణశాల రామాలయం వద్ద బతుకమ్మ వేడుకలు

గాంధీచౌక్‌లో..



రామమందిరంలో గౌరీదేవి అలంకరణలో

మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి: సీపీ సునిల్‌దత్

ఖమ్మంక్రైం:దేవినవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఒకప్రకటలో తెలిపారు. బతుకమ్మ ఆడేప్రాంతాలలో, దుర్గామాత అమ్మవారు ఏర్పాటుచేసిన ప్రాంతాల్లో భద్రతాఏర్పాట్లును పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగాఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అన్నిదుర్గామాత విగ్రహాలను జియోట్యాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు.







ఎన్ఎస్‌పీ రోడ్‌లో.., జమ్మిబండ వద్ద పూజలు, మామిళ్లగుడెంలో పూజలలో పాల్గొన్న దంపతులు

హైలెవల్ వంతెనల నిర్మాణం ఎన్నడో?

- నర్సింహులగూడెం-దుబ్బతండాలో నిర్మాణానికి నిధుల మంజూరు
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- మరో రెండు గ్రామాల్లో వంతెనలకు ప్రతిపాదనలు

కూసుమంచి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా.. లోలెవల్ వంతెనలతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దశాబ్దాల క్రితం రహదారులు నిర్మించిన అధికారులు.. ఆ సమయంలో లోలెవల్ వంతెనలు నిర్మాణం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు రాకపోకలు నిలిచిపోతున్నాయి. కూసుమంచి మండలం నర్సింహులగూడెం-దుబ్బతండ మధ్య లోలెవల్ వంతెనపై వరదనీరు ప్రవహించడం వల్ల ఆరహదారిపై ప్రయాణించే పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీవర్షం వచ్చిందంటే చాలు.. రాకపోకలు నిలవాల్సిందే. రహదారి విస్తరణ, హైలెవల్ వంతెన నిర్మించేందుకు రూ.3.71 కోట్లు 2023లో నిధులు మంజూరు అయ్యాయి. టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. గైగొళ్లపల్లి నుంచి లాల్‌సింగ్‌తండ వెళ్లే రహదారిలోనే లోలెవల్ వంతెన కారణంగా అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గైగొళ్లపల్లి నుంచి లాల్‌సింగ్‌తండ, సంధ్యతండ, తిరుమలాయపాలెం రాజారం వెళతుంటారు. వర్షం వచ్చిందటే రాకపోకలు నిలిచిపోతున్నాయి. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరీ కాలేదు. కూసుమంచి నుంచి పోచారం వెళ్లేందుకు గంగాదేవి చెరువు అలుగు ఉంది. భారీవర్షం వస్తే చెరువు మత్తడి దుంకుతుంది. ఈక్రమంలో ఆ రహదారిపై నాలుగు గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. దీనికీ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. కానీ మంజూరీ కాలేదు. మండలంలోని ఈశ్వరమాధారం-మల్లాయిగూడెం గ్రామాల మధ్య రహదారిపై హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంటుంది. పాలేరు జలాశయం పొంగినప్పుడు, పాలేరు వాగులో ప్రవహించే వర్షపునీరు ప్రవాహానికి చప్టా కొట్టుకపోయింది. దీంతో ఆ ప్రాంతవాసులే దానిపై మట్టి పోసుకుని ప్రయాణాలు చేసుకుంటున్నారు. వర్షం వస్తే సుమారు నాలుగు గ్రామాల ప్రజలు వ్యవసాయ క్షేత్రాలకు పోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు మంజూరు అయ్యాయి
ఆర్అండ్‌బీ ఏఈ పృథ్వీరాజ్

మండలంలో లోలెవల్ కొన్ని వంతెనలకు నిధులు మంజూరు అయ్యాయి. మరికొన్ని నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు.మరోసారి టెండర్లు ఆహ్వానించి పనులు పూర్తయ్యేలా చూస్తాం.





గైగొళ్లపల్లి వద్ద లాల్‌సింగ్‌తండాకు వెళ్లే రహదారిపై హైలెవల్ వంతెన నిర్మించాల్సిన ప్రాంతం, ఈశ్వరమాధారం-మల్లాయిగూడెం మధ్య ఇటీవల రోడ్డు కొట్టుకపోగా మరమ్మతులు చేసుకున్న ప్రజలు(ఫైల్)

ఆరు సహకార సంఘాల పాలక వర్గాల రద్దుపై హైకోర్టు స్టే

కల్లూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర సహకార రిజిస్ట్రార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారు ఇటీవల జిల్లాలోని ఆరు సహకార సంఘాల పాలక వర్గాల పదివి కాలాన్ని రద్దు చేయటంపై సవాల్ చేస్తూ ఆయా సంఘాల పాలవర్గ అధ్యక్షులు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం స్టే వచ్చింది. సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలోగల కల్లూరు, పోచారం,తల్లాడ సొసైటీలతో పాటుగా పాలేరు నియోజకవర్గంలోని చేగోమ్మ, ఏదులాపురంతో పాటుగా మరోక సొసైటీలకు స్టే వచ్చిందని తెలిసింది. ఈ మేరకు స్టే వచ్చిన విషయాన్ని ఆయా సొసైటీల అధ్యక్షులు ధృవీకరించారు. ఇటీవల ఆయా సహకార సంఘాల పదివి కాలం రద్దు చేస్తూ వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డీసీవో నుంచి ఆదేశాలు వచ్చిన విషయం విదితమే. దీంతో కల్లూరు, పోచారం తల్లాడ సహకార సంఘాల అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు, నర్వనేని అంజయ్య, రెడ్డం వీరమోహన్‌రెడ్డితో పాటుగా పాలేరు నియోజకవర్గ పరిధిలో గల మరో మూడు సంఘాల అధ్యక్షులు పై విధంగా హైకోర్టును ఆశ్రయించారని తెలిసింది .

రైతులకు అవసరమైన యూరియా అందించాలి

ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు నాగేశ్వరరావు



ఎంపీడీవో కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు అన్నరు. సోవారం ప్రజవాణిలో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన 9.91లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం కావలని కోతలు విధిస్తోందన్నారు. ప్రస్తుతం పంటలు పూతదశలో ఉన్నాయని, ఈ తరుణంలో రైతులకు అవసరైన యూరియా సరఫరా చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులతోఆటలాడుకుంటున్నాయన్నారు. పత్తికి మద్దతు ధర రూ.10వేలు ప్రకటిచాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు పరిహారి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.శివలింగం, తిమ్మడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, గోకినపల్లి సరోజిని, పునులరి గిరిబాబు,బండి వీరయ్య, పప్పుల వెంకన్న పాల్గొన్నారు.

రుద్రాక్షల ఎగ్జిబిషన్ 25 వరకు పొడగింపు



ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తున్న శ్రీనేపాలి రుద్రాక్ష, కరంగళి మాలల ప్రదర్శన, ఎగ్జిబిషన్ మరియు అమ్మకాలు ఈనెల 25వ తేదీవరకు పొడిగించినట్లు నిర్వాహకులు డాక్టర్ జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈప్రదర్శనలో ఏకముఖ రుద్రాక్షల నుంచి 21 ముఖములు వరకు, కరంగళి మాలలు, సిద్దిమాలలు, జాతిరత్నాలు లభిస్తాయని తెలిపారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ పది ఇంటర్మిడియట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి, జడ్పీ సీఈవో దీక్షారైనా, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మంగపతిరావు తెలిపారు. ఉదయం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు మొత్తం 63మంది విద్యార్థులకు 51 మంది హాజరయ్యారు. ఇంటర్మిడియట్ పరీక్షకు రిక్కాబజార్‌లో మొత్తం 51 మందికి 40మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మిడియట్ అధికారి కె.రవిబాబు, కోఆర్డినేటర్ మంగపతిరావు సందర్శించి పరిక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

భారీ వర్షం.. పత్తి పంటకు తీవ్రనష్టం

తిరుమలాయపాలెం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలుతో భారీవర్షం పడింది. దీంతో పత్తి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. పత్తిపంటలు గాలివానకు నేలకొరిగాయి. ఈ ఏడాది మండలంలో 15వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. పంట చేతికందే దశలో అకాలవర్షం రైతులను నట్టేట ముంచింది. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, తెట్టలపాడు, బీరోలు,రమణతండా, కొక్కిరేణి, గోపాలపుం, తాల్లచెరువు తదితర గ్రామాల్లో పత్తి పంట గాలి దుమారం, వర్షానికి నేలకొరిగింది.



రమణతండాలో నేలకొరిగిన పత్తిపంట

వెల్ఫేర్ బోర్డులో అవినీతిపై విచారణ జరిపించాలి

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు

ఖమ్మంరూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులో జరిగిన అవినీతిని వెలికితీయాలని కోరుతూ సోమవారం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దిక్కుమొక్కులేని ట్రియిల్ బ్లేజర్ అనే ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.346కోట్లు నిధులు మంజురు చేయడం సిగ్గుచేటన్నారు.ఆ కంపెనీ మూలధనం కేవలం మూడుకోట్ల రూపాయలు మాత్రమేనని అటువంటి కంపెనీకి వెల్ఫేర్ బోర్డుకు సంబందించిన రూ.346 కోట్లు రెండు రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడం దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే ఆ నిధులు వెల్ఫేర్ బోర్డులో తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లాఅధ్యక్షడు దోనోజు లక్ష్మయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు, నాగేశ్వరరావు, రాములు, వెంకన్న, లింగయ్య,రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించాలి

కార్పొరేషన్ కమిషనర్

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కారం అయ్యేలా చూడాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సంబందిత విభాగాలకు అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్, సంబందిత అర్జీలు వచ్చినప్పుడు అవి పరిష్కరించిన తరువాత సమస్య పరిష్కారం అయిన ఫొటోలను తనకు పంపించాలని ఆదేశించారు. వచ్చిన ప్రతీ అర్జీని పరిష్కరించాలన్నారు. నగరంలోని డివిజనల్ కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు స్థానిక స్థాయిలోనే తమ సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజాధనం.. ఇష్టారాజ్యం



రోడ్డు కంటే ఎత్తులో నిర్మాణం చేస్తున్న మురుగుకాలవ

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని బోనకల్ రోడ్డునుంచి మమతారోడ్డును కలిపే మార్గంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు ఇష్టారాజ్యంగా మారుతున్నాయి. రహదారి నిర్మాణంలో కరెంట్‌స్థంభాలు తీసి రోడ్డు వేయాల్సి ఉండగా ఆ స్తంభాలు తీయకుండానే పనులు చేపడుతున్నారు. అంతేకాక రోడ్డు పనులకు మురుగునీటి కాలవలకు సంబంధం లేకుండా చేస్తున్నారు. రోడ్డు కిందభాగంలో ఉంటే పక్కనే ఉన్న మురుగుకాలవ కొంతఎత్తు భాగంలో ఉంది. కిలోమీటరు రోడ్డుకు రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్న ఈపనులు ఇలా చేస్తున్నా పట్టించుకునే వారే లేరు..



నిర్మాణంలో భాగంగా స్తంభాల వద్ద కంకర పోస్తున్న టిప్పర్



స్తంభాలు తొలగించకుండా రోడ్డు నిర్మాణం జరుపుతున్న దృశ్యం

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ ఖమ్మం

26న ప్రీ ప్రైమరీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ మండలంలో ఏర్పాటు చేయనున్న ప్రీప్రైమరీ పాఠశాల బోధనా సిబ్బందికి, ఆయాలకు ఈనెల 26న ఆర్‌డీవో కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన, అనంతరం ఇంటర్వ్యూలు ఉంటాయని ఖమ్మం అర్బన్ ఎంఈవో శైలజలక్ష్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బోధనకు ఇంటర్మిడియట్ ఆపైన, ఆయాలకు 7వ తరగతి ఆ పైన ఉన్నవారు ఒరిజినల్ సర్టిపికెట్ల తోపాటు బయోడేటా ఫాం,స్టడీ, రెసిడెన్షియల్, ఆధార్, 6ఫోటోలు తీసుకోని హాజరుకావాలని తెలిపారు. నగరంలోని కుచువలాల్, ఎన్ఎస్ఎసీ, నయబజార్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. త్వరలోనే ఈ పాఠశాల్లో బోధన ప్రారంభమవుతుందన్నారు. తొలుగ గుర్తించిన అల్లీపురం పాఠశాల పరిధిలో విద్యార్థులు అతి తక్కువ మంది ఉన్న కారణంగా ఆ పాఠశాలను నయబజార్‌కు మార్చామని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితుడి ఇంటిని పరిశీలించిన మంత్రి

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఆదివారం అగ్నిప్రమాదం సంభవించిన జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారగాని వెంకటేష్ నివాసాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సందర్శించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను, జరిగిన నష్టం గురించి విచారించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు.



సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో నిర్వహిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌డేలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పద్మశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, జిల్లా సహాయ కార్యదర్శి సాదిక్‌పాష, జిల్లా నాయకులు హరీష్,చంద్ర,శివపాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు కేటాయించాలి

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఖాళీగాఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌వీ రాకేష్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి లలిత డిమాండ్ చేశారు. మంచుకొండ పీహెచ్‌సీ సమస్యలపై ఆసుపత్రి వైద్యుడు బాలకృష్ణతో చర్చించారు. పీహెచ్‌సీకి రోజుకు 80నుంచి 120 మంది రోగులు వస్తున్నారని, ఆసుపత్రిలో సదుపాయాలు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు పి.శోభ, జై.బరత్, ఇస్లావత్ రమేష్, ఇస్లావత్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ధర్నాకు కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ యూఆర్ఎస్ నాన్‌టీచింగ్ స్టాఫ్ సమస్యలు వెంటనే తీర్చాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాకు జిల్లానుంచి ప్రగతిశీల కస్తూరిబా గాంధీ నాన్ టీచింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. టీయూసీఏ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్ వీరు తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ, రాష్ట్ర నాయకులు మధుర పుష్పలత, లక్ష్మీనాగేంద్ర, కృష్ణవేణి, కోటిలింగం పాల్గొన్నారు.

ఘనంగా దేవీనవరాత్రులు ప్రారంభం



సత్తుపల్లిలో పూజలు చేస్తున్న పీవో దంపతులు



ఏన్కూరులో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

సోమవారం దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. పలుగ్రామాలలో భక్తులు అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. సోమవారం అమ్మవారు బాల త్రిపురసుందరి దేవిగా దర్శనం ఇచ్చారు. పూజారులు అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. మండపాల వద్దకు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.



కల్లూరులోఅమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మధిర లడకబజార్‌లో..

కంటి వైద్యశిబిరం విజయవంతం

ముదిగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ పుల్లయ్య దాదాపు 62మంది మహిళ కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ అరుణా దేవి, నస్రీన్ జహాన్, వైద్యసిబ్బంది మధుసూదన్‌రావు, రెడ్డెబోయిన రామారావు, లత, పద్మావతి, కుమారి, శారదా, వెంకటరమణ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

తల్లాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో నవ్యజ్యోతి సూచించారు. సోమవారం తల్లాడలోని అంగన్‌వాడీ కేంద్రం 4లో పోషమాసోత్సవాలు నిర్వహించారు. ఆకుకూరలు అధికంగా తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆమె తెలిపారు.అనతరం సీమంతాలు నిర్వహించారుక. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి,ఏఎన్ఎం కుమారి, అంగన్‌వాడీ టీచర్ రోహిణి, ఆయాసత్యవతి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

మునిసిపాలిటీ సమస్యలపై కదంతొక్కిన సీపీఎం

రూ.100 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలి

వైరా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ సమస్యల పరిష్కారం కోసం సోమవారం సీపీఎం కదంతొక్కింది. ఆ పార్టీ బృందాలు వార్డుల వారీగా సమస్యలపై సర్వే నిర్వహించాయి. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మునిసిపాలిటీ అభివృద్ధికి వెంటనే రూ.వందకోట్ల నిధులు విడుదల చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రకటించారు. మునిసిపాలిటీలో విపరీతంగా పన్నులు పెంచి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని ధ్వజమెత్తారు. డంపింగ్‌యార్డు సహా రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు, పారిశుధ్యం, శ్మశాన వాటికల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ యు.గురులింగంకు ఒక వినతిపత్రం సమర్పించారు. నాయకులు చింతనిప్పు చలపతిరావు, తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చెరుకుమల్లి కుటుంబరావు, మచ్చా మణి, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

కల్తీ మందులతో రైతులకు నష్టాలు

తల్లాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్తీ కలుపు నివారణ మందులు పనిచేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. కల్తీకలుపు నివారణ మందుల కంపెనీలపై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ వరి పొలాల వద్దనే రైతులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో స్పందించిన వ్యవసాయ అధికారి ఎండీ తాజుద్దీన్, ఏఈవోలు కలుపు పెరిగిన వరిపైర్లను సోమవారం పరిశీలించారు. వరిలో కలుపు నివారణకు వాడిన మందులు పనిచేయకపోవడంతో నష్టపోయిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఉద్యమనాయకుడు అపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో పొలాల వద్దనే ఆందోళన చేపట్టి తమ గోడు వెలిబుచ్చారు. ప్రస్తుతం వరిపైరులో దొంగ వరి, బుర్రతుంగ, వంటి కలుపు మొక్కలు ఏపుగా పెరిగి వరి పైరు ఎదుగుదలను హరించివేస్తుండంతో రైతులు కలుపు మొక్కల నివారణకు పొసెట్, రైస్ బాన్, నో వాక్సిడ్ వంటి మందులు రూ.5వేల నుంచి 10వేలు ఖర్చుచేసి స్ప్రే చేసినా ఫలితం దక్కలేదు. కలుపు కారణంగా వరి దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.



నష్టపోయిన రైతుల ఆందోళన

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

వైరా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సోమవారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, బాధితులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిపోయిందని విమర్శించారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని మరింతగా అమలుచేస్తుందని పేర్కొన్నారు. పథకాల గురించి వివరించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు ధార్న రాజశేఖర్, మచ్చా బుజ్జీ, బోళ్ల గంగారావు, తేళ్లూరి వీరయ్య, మట్టూరి వెంకటేశ్వరరావు, కోటారెడ్డి, నర్వనేని అశోక్, పమ్మి అశోక్, స్వర్ణ నరేందర్, కొలికొండ వీరభద్రరావు, దాసరి దానియేలు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పోషకాహారంపై అవగాహన

ముదిగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మాధాపురం అంగన్‌వాడీలో పోషణ మహా ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోషకాహారం, రక్తహీనతపై కిషోర బాలికలకు సీడీపీవో జి.కమలప్రియ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో జి.శారదా శాంతి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెసర కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి

చింతకాని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతులు డీఆర్‌వో పద్మశ్రీకు వినతిపత్రం అందజేశారు. రైతులు గురిజాల హనుమంరావు, యలమద్ది ప్రసాద్‌రావు, అచ్యుతరావు, సీతయ్య, గురిజాల కృష్ణయ్య, లక్ష్మయ్య, నన్నక ప్రమోద్, బోయిన రామారావు పాల్గొన్నారు.

'ఆశ' సేవలు నిరంతరం కొనసాగుతాయి

పెనుబల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆశ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగే సేవ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. సోమవారం ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 200మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫాంను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో డాక్టర్ మట్టా రాగమయి ఎమ్మెల్యేగా ఉంటూ ప్రజలకు సేవలందిస్తూనే మట్టా కుటుంబం నియోజకవర్గంలో ప్రజా సేవా కార్యక్రమాలు ఆశ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా తమ ప్రాణమున్నంత వరకు కొనసాగిస్తూనే ఉంటామన్నారు. సత్తుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 250మంది విద్యార్థినులకు సైకిళ్లు, 1500మంది నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు అందించటం జరిగిందని, ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల్లోని 30వేల మంది విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించడం జరిగిందన్నారు. సత్తుపల్లి రూరల్ సీఐ లింగయ్య, కల్లూరు ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్, రాచబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ యూసఫ్‌అలీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన మనీషాకు సన్మానం

చింతకాని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండల నాగులవంచ శ్రీ ఆదర్శ పాఠశాల పూర్వ విద్యార్థిని గార్లపాటి మనీషా మొదటి కౌన్సిలింగ్‌లోనే ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. శ్రీ ఆదర్శ పాఠశాలలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెను శాలువా, మెమెంటోతో సత్కరించారు. వైద్య విద్యలో రాణించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ కోరారు. ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు రేణుక, పార్వతి, సురేష్, కిరణ్, సుజాత పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన కార్మికులు


వైరా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంజిల్లాలోని మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరించారు. దాంతో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిల్చిపోయింది. గతనెల 26న మిషన్ భగీరథ, ఎల్అండ్‌టీ అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోనందుకు నిరసనగా విధుల బహిష్కరణ చేపట్టారు. కాంట్రాక్టు కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో వైరా రిజర్వాయర్ దగ్గరున్న మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మద్దెల రవి, కిషోర్, యాకూబ్‌అలీ, పాపగంటి రాంబాబు, బాలకృష్ణ, అనంతరావు, అన్నెం వెంకయ్య పాల్గొన్నారు. ఈ ఆందోళనకు సీపీఎం, బీఆర్ఎస్, టీడీపీ పార్టీల నాయకులు, వివిధ సంఘాలు సంఘీభావం తెలిపాయి.



హెడ్‌వర్క్స్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

వందపడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా



మధిర రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో రూ.34కోట్లతో వందపడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తిచేశారని, రెండేళ్లు గడిచినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదని, తక్షణమే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మధిర సీపీఎం నాయకుల బృందం వందపడకల ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాజకీయ కారణాలతోనే వందపడకల ఆసుపత్రిని ప్రారంభించకుండా నిలిపివేయడం బాధాకరమన్నారు. ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తే వంద గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాలకులు తక్షణమే స్పందించి భవనాన్ని ప్రారంభించాలని కోరారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు నర్సింహారావు, సైదులు, పడకంటి మురళీ, పాపినేని రాంనర్సయ్య, అనుమోలు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే భట్టి లక్ష్యం

మధిర,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పని చేస్తున్నారని మాజీ కౌన్సిలర్ మల్లాది సవిత, శివాలయం మాజీ చైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు అన్నారు. సోమవారం తొమ్మిదో వార్డులో భట్టి ఫొటోతో ఉన్న గోడ గడియారాలను పంపిణీ చేశారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి అనేక పదకాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం మోసం

సత్తుపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రూ.500పెంపు పట్ల నిరసన తెలుపుతూ ఇది కంటితుడుపు చర్య అని పీఎస్‌సీడబ్ల్యూ, టీయూసీఐ రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ అన్నారు. సోమవారం మండలంలోని సమంత క్యాంప్‌లో బెల్ట్ క్లీనింగ్‌లో జరిగిన రీజియన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. దశాబ్ద కాలానికి పైగా వివిధ విభాగాల్లో 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఆయా శాఖలలో విధులు నిర్వహిస్తూ సంస్థ లాభాల బాటలలో రావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా శ్రమిస్తున్నారని, కానీ ఈరోజు దగాచేస్తూ కార్మికులను చులకనగా చూస్తూ రూ.500పెంచడం దౌర్భాగ్యమన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కార్మికుల ఓట్లు వేయించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇదే విషయమై ప్రాతినిధ్య సంఘాలు సైతం నోరుమెదపకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్యని, మధ్యతరగతి కుటుంబాలు, బడుగుబలహీన వర్గాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులను రేపు ఓట్లు అడిగేందుకు ప్రజాప్రతినిధులు ఎలా వస్తారోనని ప్రశ్నించారు. జాన్, సంజీవరెడ్డి, రవి, ప్రసాద్, రమేష్, కుమార్, కనకయ్య పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



తుమ్మలకు ఆహ్వాన పత్రం ఇస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కల్లూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సోమవారం ఖమ్మంలో కల్లూరు ఆర్యవైశ్య ప్రములు కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి తుమ్మలను కలిసి ఆహ్వానించిన వారిలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, కల్లూరు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల అచ్యుత, దోసపాటి శ్రీనువాసరావు, పసుమర్తి రాంబాబు తదితరులు ఉన్నారు.

టవర్ ఏర్పాటును అడ్డుకున్నరైతులు

చింతకాని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు గ్రామ సమీపంలో సూర్యాపేట- దేవరపల్లి జాతీయ రహదారిపై నుంచి విద్యుత్తు లైన్ వెళ్లే విధంగా ఇరువైపులా భారీ టవర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ట్రాన్స్‌కో అధికారులు టవర్ నిర్మాణ పనులు చేపడుతుండగా అక్కడ భూములున్న రైతులు అడ్డుకున్నారు. తమ భూమిలో టవర్ ఏర్పాటు చేయొద్దంటూ అడ్డుకోవడంతో చేసేదేమి లేక అధికారులు పనులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

విద్యాభివృద్ధికి చేయూత అభినందనీయం

వైరా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వివిధ సంస్థల వారు విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం ఎంతో అభినందనీయమని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు పేర్కొన్నారు. వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను ఎస్ఐ రామారావు చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న చేతన ఫౌండేషన్‌ను అభినందించారు. ఆఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్.రషీద్ పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని ఇంటికి చేర్చిన పోలీసులు

వైరా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏడాది కిందట ఇంటి నుంచి తప్పిపోయిన ఒక వ్యక్తిని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించిన ఉదంతమిది. వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరంకు చెందిన బాదం హరికృష్ణారెడ్డి మానసిక పరిస్థితి సరిగా లేక రోడ్ల వెంట తిరుగుతూ ఏడాది కిందట తప్పిపోయాడు. ఈ క్రమంలో సోమవారం ఖమ్మం అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నెం శ్రీనివాసరావు ఓ పనిపై విజయవాడలోని ఇబ్రహీం పట్నం వెళ్లిన సమయంలో అక్కడ బస్టాండ్‌లో గడ్డం పెంచుకొని కుళ్లిన ఆహార పదార్థాలు తింటున్న హరికృష్ణారెడ్డిని చూశాడు. ఆసమయంలో శ్రీనివాసరావు హరికృష్ణారెడ్డికి వెళ్లి నీ పేరు ఏమిటి, నీ ఊరు ఎక్కడ అని అడుగా తన పేరు హరికృష్ణ అని, మా ఊరు వైరా మునిసిపాలిటీలోని సోమవరం అని చెప్పాడు. ఆవెంటనే శ్రీనివాసరావు వైరా ఎస్ఐ పుష్పాల రామారావుకు ఫోన్ ద్వారా హరికృష్ణ వివరాలను తెలిపారు. ఎస్ఐ రామారావు వెంటనే స్పందించి హరికృష్ణ వివరాలను సేకరించి ఇబ్రహీంపట్నం నుంచి వైరాకు తీసుకువచ్చారు. సోమవారం వైరా సీఐ ఎన్.సాగర్, అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హరికృష్ణారెడ్డిని కుటుంబసభ్యులకు ఎస్ఐ అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తప్పిపోయిన వ్యక్తిని కుటుంబానికి అప్పగిస్తున్న సీఐ, ఎస్ఐ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో చరిత్ర సృష్టించాం

మధిర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో అర్హులందరికీ సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందించామని అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. సోమవారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర పట్టణ, మండలం లోని వివిధ గ్రామాలకు సంబంధించిన 72 మంది బాధితులకు రూ.27 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. మధిర నియోజకవర్గంలో వైద్య చికిత్స కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆదుకున్నామని, మండలంలో ఒకే రోజు 72 మందికి ఇంత పెద్ద మొత్తంలో ఇంతకు ముందు ఎన్నడూ బాధితులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, పాటిబండ్ల సత్యంబాబు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, అద్దంకి రవి, కరివేద సుధాకర్, బివిఆర్, మిరియాల కాశీ, జహంగీర్, గొల్ల మందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న కిషోర్

సహకార సంఘాల రద్దుపై హైకోర్టు స్టే

కల్లూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర సహకార రిజిస్ట్రార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారు ఇటీవల జిల్లాలోని ఆరు సహకార సంఘాల పాలక వర్గాల పదివి కాలాన్ని రద్దు చేయటంపై సవాల్ చేస్తూ ఆయా సంఘాల పాలవర్గ అధ్యక్షులు హైకోర్టును ఆశ్రయించగా సోమవారం స్టే వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలో గల కల్లూరు, పోచారం, తల్లాడ సోసైటీలతో పాటుగా పాలేరు నియోజకవర్గంలోని చేగొమ్మ, ఏదులాపురంతో పాటుగా మరోక సోసైటీలకు స్టే వచ్చిందని తెలిసింది. ఈ మేరకు స్టే వచ్చిన విషయాన్ని ఆయా సోసైటీల అధ్యక్షులు ధృవీకరించారు. ఇటీవల ఆయా సహకార సంఘాల పదివికాలం రద్దు చేస్తూ వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డిసిసి నుంచి ఆదేశాలు వచ్చిన విషయం విదితమే. దీంతో కల్లూరు, పోచారం తల్లాడ సహకార సంఘాల అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు, నర్వనేని అంజయ్య, రెడ్డం వీరమోహన్‌రెడ్డితో పాటుగా పాలేరు నియోజకవర్గ పరిధిలో గల మరో మూడు సంఘాల అధ్యక్షులు పై విధంగా హైకోర్టును ఆశ్రయించారని తెలిసింది.

పెనుబల్లి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



పెనుబల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల తహసీల్దార్‌గా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి నుంచి బదిలీపై పెనుబల్లి తహసీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ మూడునెలలపాటు పనిచేసిన ఎస్వీనారాయణమూర్తి ఖమ్మం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

బాలాత్రిపుర సుందరిగా దర్శనం

తల్లాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని కోటమైసమ్మ తల్లి దేవాలయంలో సోమవారం బాలత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మొదటి రోజు దేవాలయం నిర్వాహకులు లగడపాటి నెహ్రూ-మాధవి ఆధ్వర్యంలో అమ్మవారిని బాలత్రిపురసుందరీగా అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు కంచల సతీష్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



యూరియా కూపన్ల కోసం సొసైటీ వద్దకు రావొద్దు

కారేపల్లి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఇక నుంచి రైతులకు యూరియా కూపన్లు జారీ చేయడం జరగదని, సింగరేణి క్లస్టర్ పరిధిలోని అప్పాయిగూడెం రైతు వేదికలోనే పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలపారు. క్లస్టర్ పరిధిలోని సింగరేణి, అప్పాయిగూడెం, రావోజీతండా, పేరుపల్లి, సూర్యతండా పంచాయతీలకు సంబంధించిన రైతులు మాత్రమే అక్కడ కూపన్లు ఏప్పుడు జారీ చేస్తే అప్పుడే తీసుకోవాలని కోరారు.

యూరియా కోసం రైతుల నిరసన

వైరా: యుద్ధప్రాతిపదికన యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గొల్లెనపాడు రైతులు సోమవారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైరా మండలానికి 500మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. యూరియా లేక సాగుచేసిన పంటలు దెబ్బతింటున్నాయని, ప్రస్తుత తరుణంలో యూరియా అవసరముందని వెంటనే సరఫరా చేయాలని కోరారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. నాయకులు కిలారు శ్రీనివాసరావు, అమరనేని వెంకటేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాస్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ కేంద్రాల పరిశీలన

ఏన్కూరు: యూరియా పంపిణీ కేంద్రాన్ని వైరా ఏడీఏ కరుణశ్రీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్, రికార్డులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిజిల్ పంటల నమోదును కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఏవో నరసింహారావు, సీఈవో నాగలక్ష్మి, ఏఈవోలు లహరి, శ్రీకాంత్, బాలకృష్ణ పాల్గొన్నారు.

చింతకాని: రైతులకు ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లోనే యూరియా విక్రయిస్తున్నట్లు మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో యూరియా పంపీణీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందజేస్తున్నామన్నారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులు మండల కేంద్రాలకు రాకుండా వారి సౌలభ్యం కొరకు గ్రామాల్లోనే సబ్ సెంటర్‌లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు టోకెన్లు అందజేసి నిర్ణత తేదీల ప్రకటించి టోకెన్ల వారిగా యూరియా ఇస్తున్నామన్నారు. ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు ఆయేషా, తేజ పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం పునఃప్రారంభం

కల్లూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని టీటీడీ కళ్యాణ మండపంను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ సోమవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ సామాన్య మధ్య తరగతి కుటంబాల ప్రజానీకానికి అందుబాటులో శుభకార్యాలు చేసుకునేలా ఈ మండపంను ఆధునీక సౌకర్యాలతో పునః ప్రారంభించటం జరిగిందన్నారు. ఇతర మండపాల అద్దెకు భిన్నంగా పేదలపై ఆర్థిక భారం పడకుండా ఈ మండపం సౌలభ్యంగా ఉంటుందన్నారు. టీటీడీ సంస్థ తరుపున ఈ మండపంలో జరగనున్న శుభాకార్యాలకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మండప నిర్వహకులు ఎనుముల రాము, రుక్మిణ యాదవ్‌లకు దయానంద్ అభినందనలు తెలిపారు. ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మండల కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తకెళ్లపాటి దుర్గాప్రసాద్, గంగాదేవిపాడు సొసైటి అధ్యక్షుడు తూము వీరభద్రరావు, నాయకులు తలపురెడ్డి హనీమిరెడ్డి, భాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, శ్రీను, భూక్యా శివకుమార్‌నాయక్, నరిసింహారావు పాల్గొన్నారు.